


శివరాత్రికి ప్రత్యేక బస్సులు

అరసవల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా బుధవారం వివిధ శైవ క్షేత్రాలకు 60 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం నుంచి రామతీర్థాలకు 30, టెక్కలి నుంచి రావివలసకు 12, పలాస నుంచి సాబకోటకు 12, శ్రీముఖలింగానికి 6 ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. సోమవారం శ్రీకాకుళం నుంచి శ్రీశైలానికి సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నామని, ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ బుకింగ్ సదుపాయం కల్పించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- శిథిలావస్థలో గొట్టా బ్యారేజీ
- ముందుకు కదలని ఆఫ్‌షోర్
- అతీగతి లేని నారాయణపురం
- నిధుల కేటాయింపుపై ఆశలు

సిక్కోలుపై కరుణ చూపిస్తారా?



పలాస మండలం రేగులపాడు వద్ద నిలిచిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లా శ్రీకాకుళం. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగక మరింత వెనక్కువెళ్లిపోయింది. ముఖ్యంగా సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేయడం, అవసరమైన వాటికి నిధులు వెచ్చించకపోవడంతో రైతుల సమస్యలు ప్రతి ఏడాది రెట్టింపు అవుతున్నాయి. దీంతో వారి ఇబ్బందులు అంతా ఇంతా కావు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతేడాది నవంబరులో జరిగిన మొదటి బడ్జెట్ సమావేశాల్లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు నిధులను కేటాయించింది. ఇప్పుడు రెండో బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాకు చెందిన శాసన సభ్యులు తమ నియోజకవర్గాల అభివృద్ధికి నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువచ్చేందుకు గాను, ప్రజా గొంతుకని అక్కడ వినిపించి నిధులు మంజూరు చేయించుకునేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి నిర్లక్ష్యంగా ఉన్న జిల్లాలో సాగునీటి రంగంపై ప్రధానంగా దృష్టిసారిస్తే మేలు జరుగుతుందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నారాయణపురం ఆనకట్ట..

2014-19 మధ్య కాలంలో నారాయణపురం ఆనకట్ట కాలువకు సంబంధించి పనులు జైకా నిధులతో చేపట్టారు. మొత్తం రూ.112 కోట్లు నిధులు అవసరముంటే అందులో మూడో వంతు పనులను మాత్రమే పూర్తిచేయగలిగారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. నారాయణపురం కుడి, ఎడమ కాలువలపై కనీస దృష్టిసారించలేదు. పనులు అత్యంత నెమ్మదిగా జరిగాయి. ఆ బిల్లులు కూడా ఇప్పటికీ పెండింగే. పెండింగ్ పనులకు మోక్షంలేదు. దీంతో ఏళ్లతరబడి సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో 20వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.



ఎచ్చెర్లలోని నవభారత్ జంక్షన్ వద్ద నారాయణపురం కుడికాలువ ఇలా..



గొట్టా బ్యారేజీ ఇలా..

గొట్టా బ్యారేజీకి రూపాయి కూడా ఇవ్వలే..

గొట్టా బ్యారేజీ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు. గత వైసీపీ ప్రభుత్వం ఈ బ్యారేజీని తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతుల కోసం ఐదేళ్లలో కనీసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో బ్యారేజీ దిగువ ప్రాంతం దెబ్బతింది. జడ్జిస్టోన్ ఏప్రాన్, సీసీ బ్లాక్‌లు చెల్లాచెదురయ్యాయి. గత ఆరేళ్ల నుంచి నిధులు లేక, మరమ్మతులు జరగక రోజురోజుకీ బ్యారేజీ పటిష్టత కోల్పోతుంది. కాలువల లైనింగ్ సంగతి దేవుడెరుగు కనీసం గుండెకాయ వంటి బ్యారేజీని బాగుచేయడం లేదు. దీంతో నిల్వ నీరంతా వంశధారలోకి వెళ్లిపోతుంది. అలాగే వంశధార ఫేజ్-2 పనులు కాస్త పెండింగ్ ఉన్నాయి. వీటికి గతేడాది జూన్ నుంచి చెల్లింపులు లేవాయె. హిరమండలం రిజర్వాయర్‌కు రూ.40 కోట్లు నిధులు విడుదల చేస్తే పనులు పూర్తయ్యే అవకాశముంది. అలాగే పెండింగ్ బిల్లులు రూ.20 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. అప్పుడే ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో వంశధార ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని. ఈ దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు..

ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ఇటీవలే రూ.20 కోట్లను చెల్లించింది. వాస్తవానికి రూ.35 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే తొలివిడత నిధులు చెల్లించినా, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీనిపై అధికారయంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే సాంకేతిక పరంగా అడ్డంకులు లేకుండా ఆఫ్‌షోర్ పనులు ముందుకుసాగేలా చూడాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు శ్రీకాకుళంలో ఔటర్ రింగు రోడ్డు, వంశధార-37 టీఈ కాలువ ఆధునికీకరణ, కొత్తవలస, కళింగపట్నం ఎత్తిపోతల పథకాలు, కోడి రామ్మూర్తి స్టేడియం, మెళియాపుట్టిలో ఐటీడీఏ కార్యాలయం ఏర్పాటు, వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునికీకరణ, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, తోటపల్లి కాలువల పనులు, వనితమండలం-గార వంతెన, జీడి బోర్డు ఏర్పాటు, థర్మల్ పవర్ ప్రాజెక్టు, బెంతు ఒరియా కులస్థుల ఇబ్బందులు, తదితర సమస్యలు ఉన్నాయి. వీటిపై జిల్లా ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ప్రస్తావించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి

- నిధుల కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్న ఎమ్మెల్యేలు

8లో

బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

7లో



ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- ఉదయం 820 మంది, మధ్యాహ్నం 831 మంది గైర్హాజరు



ఆలస్యం కావడంతో పరీక్ష కేంద్రానికి పరుగులు తీస్తున్న అభ్యర్థి



ఎచ్చెర్లలోని వేంకటేశ్వర కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అరసవల్లి/ఎచ్చెర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శ్రీకాకుళంలో 8, ఎచ్చెర్లలో 7 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగింది. మొత్తం 5,535 మంది అభ్యర్థులకు గాను ఉదయం 4,715 మంది హాజరుకాగా, 820 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 4,704 హాజరుకాగా, 831 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 91 శాతం అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకున్నారు. ఈ కేంద్రాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించి హాల్ టికెట్, గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. అంబేడ్కర్ వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో జరిగిన పరీక్షకు హాజరైన శ్రీకాకుళం నగరానికి చెందిన కె.అనూష అనారోగ్యానికి గురైంది. ఆమెకు ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.ఉషశ్రీ, హెల్త్ అసిస్టెంట్ చిన్నవాడు చికిత్స అందించారు. అనంతరం అనూష పరీక్ష రాసింది. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఓ దివ్యాంగునికి సహకరించి సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చారు.



శ్రీకాకుళంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తదితరులు

చిరస్మరణీయుడు ఎర్రన్నాయుడు

- నివాళులర్పించిన మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు తన స్వగ్రామం నిమ్మాడలో ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని ఎర్రన్న ఘాట్ వద్ద ఆయన సతీమణి విజయకుమారి, కుమారుడు, కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సోదరుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇతర కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రన్నా యుడు చిరస్మరణీయుడని, జిల్లా కీర్తిని దేశానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తని మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అలాగే విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, పాతపట్నం శాసనసభ్యులు గొండు శంకర్, మామిడి గోవిం దరావు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, మాజీ శాసన మండలి సభ్యులు విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

టీవీలకు అతుక్కుపోయారు

- భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను వీక్షించిన ప్రజలు
- నిర్మానుష్యంగా నగర రోడ్లు



పీఎస్ఎన్ఎం స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో మ్యాచ్ వీక్షిస్తూ..

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఇండియా-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను చూసేందుకు ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. దాయాదుల పోరుగా పేరొందిన భారత్-పాక్ మ్యాచ్‌ను తిలకించేందుకు విద్యార్థులు, క్రీడాభిమానులు, యువతీ యువకులు ఆసక్తి చూపారు. ఇళ్లల్లో టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లలో వీక్షించారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలి, 80 అడుగుల రోడ్డు, జీటీ రోడ్డు, డేఅండ్‌నైట్ జంక్షన్, తదితర రహదారులు జనాలు లేక నిర్మానుష్యంగా మారాయి. భారత్ విజయంతో అభిమానులు ఆనందాన్ని పంచుకున్నారు.



నిర్మానుష్యంగా డేఅండ్‌నైట్ కూడలి

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి కూడా రెండు గంటల సమయం పట్టింది. మహిళలు ఇంద్రపుష్కరిణి సమీపంలోని మర్రిచెట్టు వద్ద దీపాలు వెలిగించి, క్షీరాన్నం వండి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఐఏఎస్ అధికారి సుబ్బారావు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజు రూ.11,96,181 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.8,09,600, విరాళాల రూపంలో రూ.1,34,906, ప్రసాదాల ద్వారా రూ.2,51,675 ఆదాయం సమకూరింది. కాగా, ఎప్పటిలాగానే క్యూలైన్లలో అరకొర ఏర్పాట్లతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగడానికి మంచినీరు కూడా లేకపోవడంతో భక్తులు అసహనానికి గురయ్యారు.



ఎండలోనే భక్తులు



రొట్టవలస ఏబీ రోడ్డు పక్కన నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

ధాన్యం కొనట్లే!

- సరుబుజ్జిలిలో నిలిపివేసిన అధికారులు
- లక్ష్యం పూర్తయిందంటున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- రోడ్ల పక్కన, పొలాల్లో ధాన్యం బస్తాల నిల్వ

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనాలి. వారికి ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దు.' అని ప్రభుత్వం ఆదేశించినా చాలాచోట్ల అధికారులు పట్టించుకోవడం లేదు. టార్గెట్ అయిపోయిందంటూ చాలా మండలాల్లో ధాన్యం కొనుగోలును నిలిపివేశారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా పొలాల్లోనే ధాన్యం కుప్పలు, బస్తాలు ఉన్నాయని, వాటిని ఏమి చేయాలని ప్రశ్నిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలో నెల రోజులుగా ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. గత డిసెంబరు నాటికే ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయినట్లు అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 2,446 ఎకరాల వరి విస్తీర్ణంకు గాను ఈ-క్రాప్ చేశారు. దీనికి సంబంధించి 6,458 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా విధించారు. అయితే, ఈ లక్ష్యం పూర్తయిందని, ఇక ధాన్యం తీసుకోమని అధికారులు చెబుతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని రొట్టవలస, కొండవలస, కొత్తకోట, షలంత్రి, సరుబుజ్జిలి, సింధువాడ, ఇసకలపా లెం, విద్యారామపురం, పురుషోత్తపురం, తదితర పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు ఆగి పోయాయి. రైతులు తమ ధాన్యం బస్తాలను పంట పొలాల్లో, రోడ్డుపక్కన నిల్వ చేసి

(మిగతా 7వ పేజీలో..)

ధాన్యం కొనుగోలు చేయాలి..



ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఇంకా పూర్తిస్థాయిలో నూర్పులు చేపట్టక ముందే లక్ష్యాలు ఎలా పూర్తయ్యాయో అధికారులు చెప్పాలి. ట్రక్ షీట్ కోసం వెళితే లక్ష్యం పూర్తి జరిగిందంటున్నారు. ధాన్యాన్ని పంట పొలాలు, రోడ్డుపక్క నిల్వ చేయలేక ఇబ్బందులు పడుతున్నాం.

-బెవర లక్ష్మణరావు, రైతు, రొట్టవలస

ఇండెంట్ పెట్టాం..

మండలంలో ధాన్యం కొనుగోలు లక్ష్యాలు పూర్తయ్యాయి. రైతుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. రెండో విడత కొనుగోలు కోసం ఈ నెల 17న తహసీల్దార్ ఇండెంట్ పెట్టారు. త్వరలో కొనుగోలు ప్రారంభిస్తాం.

-సత్యనారాయణ, సీఎస్ డీటీ

వైభవంగా వాసుదేవుని రథోత్సవం

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

8లో

ప్రత్యామ్నాయం చూపండి

- పలాసలో కేంద్రీయ విద్యాలయం పనులను అడ్డుకున్న స్థానికులు

ప్రజలు ఛీకొట్టినా జగన్ తీరు మారలేదు

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఉన్న అహంకారానికి తగ్గట్టుగానే ప్రజలు తీర్పు ఇచ్చినా ఆయనలో ఎటువంటి మార్పు రాలేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ప్రజలు స్పష్టంగా తీర్పు ఇచ్చారు. జగన్‌రెడ్డికి ఉన్న అహంకారానికి తగ్గట్టుగానే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టారు. అధికారం, కక్ష సాధింపులు, ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం, ఎవరినీ లెక్క చేయకపోవడం, రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కడం వంటి విషయాలన్నీ చూసిన ప్రజలు కేవలం 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారు. అయినా ఇప్పటికి జగన్‌రెడ్డి అదే రీతిలో మాట్లాడుతుండడం ఆశ్చర్యం కలుగుతోంది. అసలు వైసీపీ వాళ్లు చేస్తున్న పోరాటం దేనికోసం అంటే వాళ్ల నాయకుడికి ప్రతిపక్ష హోదా రాలేదని పోరాటం చేస్తున్నారంట. మొన్న కూడా చూశాం. వాళ్ల నాయకుడికి జెడ్ ప్లస్ కేటగిరీలో సెక్యూరిటీ కల్పించాలట.. అసలు ప్రజల కోసం పోరాటం చేయాలన్న ఆలోచనే జగనరెడ్డికి లేదు. ఆయన కోసం, ఆయనకు సెక్యూరిటీ కోసం మాత్రమే ఆ పార్టీ నాయకులు పోరాటం చేయడం చూస్తున్నారు." అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

శ్రీశైల మల్లన్నకు 'సిక్కోలు తలపాగా'



తలపాగాను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వస్తోందంటే చాలు గుజరాతీపేటలో ఉన్న దేవాంగులవీధిలో ఒకటే సందడి. 75 ఏళ్లగా దాదాపు ఒకటిన్నర నెలల ముందే అక్కడికి చేనేత కార్మికులందరూ మిగతా అన్ని కార్యక్రమాలు పక్కనపెట్టేసి శ్రీశైల మల్లన్నకు సమర్పించేందుకు ప్రత్యేక కిరీట ధారణగా ఒక వస్త్రాన్ని తయారు చేస్తారు. నేత పని పూర్తయిన తర్వాత ప్రత్యేక పూజలు, ఊరేగింపు నిర్వహించి శ్రీశైలానికి తీసుకువెళతారు. ఈ ఏడాది కూడా తలపాగా వస్త్రాలు పంపించేందుకు చేనేత కార్మికులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా 365 మూరలు ఉన్న స్వామివారి తలపాగను ఆదివారం సందడిగా ఊరేగింపు చేపట్టారు. 45 రోజులు 11 మంది శివ మాలధారణ చేసి తలపాగను స్వామి వారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీవీ రాజు, బళ్ల తిరుమలరావు, బుచ్చిబాబు, దివ్యకుమార్, ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి అందరికీ దర్శనం చేయించారు. ఊరేగింపులో తప్పెటగుళ్లు, కోలాటం, మేలతాళాలు, బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరంతో తలపాగా తీసుకుని పలువురు భక్తులు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ఆమదాలవలస, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బంది ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కోరారు. ఈ మేరకు వారు ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని అందించారు. కరోనా సమయంలో ప్రజలకు అర్బన్ హెల్త్ కేంద్రాల తరపున సేవలందించామన్నారు. వైసీపీ ప్రభుత్వం 2021 సెప్టెంబరులో తమను తొలగించి తొమ్మిది నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న అర్బన్ హెల్త్ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందిని మాత్రమే తొలగించి మిగతా జిల్లాలో వారిని కొనసాగించారన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్.రాంబాబు, పి.రాజేశ్వరరావు, జి.శ్రీదేవి, ఎస్.నన్యాసిరావు ఉన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

అన్ని రంగాల్లో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిక్కోలు వాసులు కోరుతున్నారు. సోమవారం ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశం నేపథ్యంలో జిల్లా వాసుల అభిప్రాయాలు ఇలా.. - (ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

జిల్లా ఐటీడీఏ లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే జిల్లాలు విభజించడంతోపాటు.. ఐటీడీఏ పక్క జిల్లాకు దక్కేలా చేసింది. గిరిజన సమస్యలపై సీతంపేటకు వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్నాం. ఐటీడీఏ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- బైరసింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి



రిఫరల్ ఆసుపత్రిగానే గుర్తింపు

టెక్కలిలో 200 పడకలతో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాసుపత్రి రిఫరల్ ఆసుపత్రిగానే గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ రోగులకు సరైన సేవలు అందకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. అరకొర మందులు, అరకొర వైద్య సేవలతో రిఫరల్ ఆసుపత్రిగా గుర్తింపు సాధించింది. కూర్చునేందుకు సరైన బెంచీలు కూడా లేవు.

- కోత మధుసూధనరావు, అభ్యుదయ రైతు, టెక్కలి



ఉపాధి అవకాశాలు కల్పించాలి

సహకార చక్కెర కర్మాగారం, దూసిలోగల కాన్‌కాస్ట్ కర్మాగారం, జొన్నవలస జూట్ మిల్లు మూతపడి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు లేకపోవడంతో వలసలు వెళ్లిపోతున్నారు. దీనిని నివారించాల్సిన అవసరం ఉంది.

- తమ్మినేని విద్యాసాగర్, ఆమదాలవలస



తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలో తాగునీటి సమస్య ప్రధానంగా వేధిస్తోంది. మున్సిపాల్టీ ఏర్పడి మూడు దశాబ్దాలు దాటినా నేటికీ కొన్ని వార్డులకు తాగునీరు అందడం లేదు. పుష్పగిరి కొండపై వాటర్ ట్యాంకర్ నిర్మాణం చేపట్టినా పైపులైన్ పూర్తిచేయలేదు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలి.

- సాలిన ఢిల్లీ యాదవ్, ఏఎస్ పేట, ఇచ్ఛాపురం



మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి

మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో ఉన్న దళ్లాం చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి. వేలాది ఎకరాల భూమికి సాగునీరు అందించే ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే ఆయకట్టు రైతులకు ఎంతో మేలుచేస్తుంది.

- కైబాడి రాజు, మాజీ ఎంపీటీసీ, శ్రీకూర్మం, గార మండలం



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయాలి

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తయితే మా నియోజకవర్గంలో అభివృద్ధి కనిపిస్తుంది. ఈ రిజర్వాయర్ ఇక్కడి ప్రజల కల. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా హామీలు నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వం ఈ బాధ్యత తీసుకుంటే చరిత్రలో మిగిలిపోతుంది. జలజీవన్ మిషన్, ఉద్దాన రక్షిత నీటి పథకం పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

- డి.పవన్ కుమార్, వెంకటాపురం, వజ్రపుకొత్తూరు



ఆధునికీకరణ పనుల చేపట్టాలి

గత టీడీపీ పాలనలో నారాయణపురం ప్రాజెక్టు ఆధునికీకరణకు జైకా నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. కుడి కాలువ కింద ఉన్న ఎచ్చెర్ల మండలంలోని శివారు ప్రాంతాలకు ఏటా సాగునీరు కష్టతరమవుతోంది. వచ్చే ఖరీఫ్ నాటికైనా ఈ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలి.

- నక్క లక్ష్మణరావు, కొంగరాం, ఎచ్చెర్ల మండలం



హార్బర్ పనులు ప్రారంభించాలి

బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ పనులు తక్షణమే ప్రారంభించేందుకు నిధులు కేటాయించాలి. ఈ పనులకు టెండర్లు ఖరారైనా నేటికి పనులు ప్రారంభం కాలేదు. హార్బర్ పనులు పూర్తయితే ఈ ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు నివారించవచ్చు.

- అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం, ఎచ్చెర్ల మండలం

పర్మినెంట్ చేయాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐజే నాయుడు కాలనీలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఎం.రాజేష్, కె.రాజు, కె.గోవింద, ఎస్.రమ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టును అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కూటమి నేతలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నారాయణపురం ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనుల పూర్తికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కూటమి నేతలు కలిసి కోరారు. టీడీపీ సీనియర్ నేత పంచిరెడ్డి సత్యనారాయణ, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, గోపిన కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. జైకా నిధులతో ప్రారంభమైన ఈ పనులు ఇప్పటివరకు మూడో వంతు కూడా పూర్తికాలేదన్నారు. ఏటా సాగునీటి కష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

గుజరాతీపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు పోరాటం చేస్తానని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రిటైర్డు డిప్యూటీ డీఈవో కె.అప్పారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చౌదరి రవీంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ ఉన్నారు.

● ఆమదాలవలస, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి గెలిపించాలని యూటీఎఫ్ నాయకుడు బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఆదివారం కనుగులవలసలో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చౌదరి రవీంద్ర, భాస్కరరావు, తమ్మినేని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బాపూజీ కళామందిర్‌లో జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గాత్రం కృష్ణవేణి, సరస్వతి, వయోలిన్ మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగం విజయవాడకు చెందిన బీవీవీఎస్ ప్రసాద్, ఘటం మావుడూరు సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించారు. అలాగే త్యాగరాజ స్వామి చిత్రపటంతో తిరువీధి నిర్వహించారు. కళాకారులకు సత్కరించారు.

సింహద్వారం ప్రారంభం

కవిటి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సీహెచ్ కపాసుకుద్దిలో తోటమ్మతల్లి సింహద్వారాన్ని ఆదివారం ప్రారంభించారు. శనివారం నుంచి మూడురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సముద్ర జలాన్ని తీసుకొచ్చి పూజలు చేశారు. అఖండ భజన, తిరువీధి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఎర్రన్నాయుడి సేవలు మరువలేనివి

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి తదితరులు

అరసవల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి సేవలు మరువలేనివని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎర్రన్నాయుడి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత ఎర్రన్నాయుడి చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, నాయకులు మాదారపు వెంకటేష్, వెంకటరామరాజు, కవ్వాడ సుశీల తదితరులు పాల్గొన్నారు.



ఎర్రన్నాయుడు ఆశయ సాధనకు కృషి

నరసన్నపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయసాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం ఎర్రన్నా యుడు జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయ కర్త బగ్గు అర్చన, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, మూకళ్ల చిన్నయ్య, బలగ భారతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎర్రన్నాయుడి జయంతి నిర్వహించారు.

నరసన్నపేట: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

'పాకలపాటి' విజయానికి కృషి చేద్దాం

అరసవల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ విజయానికి కృషి చేద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కూటమి, ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయుల సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ గురజాల రాము, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అప్సా యూనియన్ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగ కార్యదర్శి ఎస్‌ఏ మాలిక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డు మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఉత్తమ సేవలు అందిస్తా

అరసవల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారంలో ఉత్తమ సేవలను అందిస్తానని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొప్పల డేనియల్, అంపోలు ప్రతాప్, ఆవాల అప్పన్న, కింజరాపు నూకరాజు, ఎచ్చర్ల మురళి, భైరి ధనరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూపై అపోహలు వద్దు



చికెన్, ఎగ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, ప్రజలు ఎటువంటి అపోహలకు పోవద్దని పశు సంవర్ధక శాఖ రిటైర్డు జేడీ మెట్ట వెంకటేశ్వరరావు తెలిపారు. బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో అపోహలు పోగొట్టేందుకు పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాల్ ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. బాయిలర్ ఫార్మర్స్ ట్రేడర్స్ సహకారంతో పాతబస్టాండ్, ఆర్ట్స్ కళాశాల రోడ్డులో 500 కిలోల వండిన చికెన్, నాలుగు వేల ఉడకబెట్టిన గుడ్లు పంపిణీ చేశారు. సోమవారం చిలకపాలెం, పొందూరులో, మంగళవారం నరసన్నపేట, టెక్కలి, హిరమండలంలో, శుక్రవారం పలాస, సోంపేటలో కూడా ఉచిత చికెన్, ఎగ్ మేళాల నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు శ్రీనివాసరావు, సిబ్బంది రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లి ర్యాంపు వద్ద ఉద్రిక్తత

● నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిని అడ్డుకున్న గ్రామస్థులు, ట్రాక్టర్ డ్రైవర్లు



రవికుమార్‌ను నిలదీస్తున్న దృశ్యం

పొందూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డేపల్లి ఇసుక ర్యాంపును పరిశీలించేందుకు ఆదివారం వచ్చిన నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను టీడీపీ నాయకులు, గ్రామస్థులు, ట్రాక్టర్ డ్రైవర్లు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.6వేలకు గాని లభించేదికాదని, ఇప్పుడు ఉచిత ఇసుక విధానంతో కేవలం రూ.1,500కే లభిస్తుందని వారు తెలిపారు. దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారంటూ ఆయన్ని నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న ఆమదాలవలస సీఐ సత్యనారాయణ అక్కడకు చేరుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ర్యాంపుకు ఎలా వస్తారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగి గొడవలు జరిగితే ఎవరిది బాధ్యతని రవికుమార్‌ను ప్రశ్నించారు. దీంతో చేసేదిలేక అక్కడి నుంచి ఆయన వెనుదిరిగారు.

ధాన్యం కొనట్లే!

(ఐదో పేజీ తరువాయి)

కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతు సేవా కేంద్రాల కొనుగోలు జరగకపోవడంతో వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారు. 80 కేజీల ధాన్యం బస్తాకు అదనంగా మూడు కేజీల ధాన్యం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.150కు తక్కువగా అమ్ముకోవాల్సి వస్తుందని రొట్టవలసకు చెందిన రైతులు తొత్తడి వైకుంఠరావు, బొంగు సత్యనారాయణ, తాడేల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరుతున్నారు.

రాజమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



గార: భూలోకమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

గార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వత్సవలసలో రాజమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సముద్ర స్నానాలు చేసి పూజలు నిర్వహించారు. సీఐలు పైడపునాయుడు, బి.ప్రసాదరావు (మెరైన్) ఆధ్వర్యంలో గార ఎస్ఐ ఆర్.జనార్దన్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే శ్రీకూర్మం క్షేత్రంలో కూర్మనాథుడిని భక్తులు దర్శించుకున్నారు.

దళ్లవలసలో..



పొందూరు: అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పొందూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దళ్లవలస గ్రామంలో వెలసిన రాజమ్మను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రతీ రెండేళ్లకోసా నిర్వహించే ఈ జాతర ఉత్తరాంధ్రతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట



నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద ప్రయాణికుల రద్దీ

అరసవల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం సాయంత్రం ప్రయాణికులతో కిటకిటలాడింది. మాఘమాసం ఆదివారం ఆదిత్యుని దర్శనానికి వచ్చే భక్తులు, గ్రూప్-2 పరీక్షలకు హాజరైన అభ్యర్థులు, వత్సవలస రాజమ్మ జాతరకు తరలివచ్చిన యాత్రీకులు, పెద్ద సంఖ్యలో జరిగిన పెళ్లిళ్లకు హాజరైనవారితో కాంప్లెక్స్ పరిసరాలు నిండిపోయాయి. విశాఖ వెళ్లే నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఆర్టీసీ అధికారులు రద్దీకి అనుగుణంగా అవసరమైన రూట్లలో బస్సులను నడిపించారు.

భాగస్వాములు కావాలి

అరసవల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐక్యవేదిక ప్రతినిధులు పుట్టా సురేంద్రబాబు, డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక 2వ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం నగరంలోని కళింగ సామాజిక భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు మంచాల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఐక్యవేదిక జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామసభల్లో ఓటర్లంతా పాల్గొని గ్రామాభివృద్ధిపై చర్చించి కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జైభారత్ వ్యవస్థాపకుడు రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం పంచాయతీ బాపన్నపేట గ్రామానికి చెందిన దుంపల వాసుదేవరావు (24) ఆదివారం పురుగు మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వాసుదేవరావు గత ఏడాది డిసెంబరు 18న సీమెన్ ఉద్యోగం కోసం ముంబై వెళ్లాడు. అయితే అక్కడ నుంచి ముడురోజుల కిందట అనారోగ్యంతో బాధ పడుతూ కొన్ని మందులు తీసుకొని ఇంటికి చేరాడు. అయితే అందరితో కలిసి మెలిసి తిరుగుతూ ఆదివారం ఉదయం నరసన్నపేటలో ఒకరిని పరామర్శించి మధ్యాహ్నానికి ఇంటికి చేరాడు. పొలానికి వినియోగించగా మిగిలిన పురుగు మందును తండ్రి అప్పన్న ఇంట్లో దాచాడు. ఏం జరిగిందో తెలియదు కాని ఆ మందులో సగం వాసుదేవరావు సేవించాడు. దీనిని తల్లి లక్ష్మి గమనించి పరుగున వెళ్లి మందు డబ్బాను చేతిలోంచి లాక్కుని వెంటనే ఇరుగు పొరుగు వారికి విషయం తెలిపింది. వెంటనే వారు వచ్చి వాసుదేవరావును కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

31 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి మూటలతో గుజరాత్‌కు తరలిస్తున్న ఇద్దర్ని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 31.110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉపేంద్ర సైన్ చెడు వెసనాలు అలవాటు పడి గంజాయి రవాణా చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఒడిశా రాష్ట్రం కోడల గ్రామంలో దీపక్ వద్ద గంజాయి తీసుకుని గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో దీపక్ సూచించిన వ్యక్తికి అందజేసేందుకు మరో వ్యక్తితో ఉపేంద్ర ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనుమానితులుగా తిరుగుతుండడంతో వీరి వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారిద్దరిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, హెచ్‌సీ తెలుకుల రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

గార, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొర్ని గ్రామానికి చెందిన వజ్జ రమణమూర్తి (37)కి 2016లో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలున్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పులతో ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటున్నాడు. దీంతో కొన్నాళ్లుగా మానసికంగా బాధపడుతూ ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమణమూర్తి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.జనార్దన్ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు

నందిగాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేవుపురం యూపీ పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు కొండాల గోపాలంపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. శనివారం డీఈవో ఎస్.తిరుమలచైతన్య, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తదితరుల నేతృత్వంలో ఈ ఘటనపై విచారణ చేపట్టడగా వాస్తవమని తేలడంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దేవుపురం యూపీ పాఠశాలలో జరిగిన ఘటనకు బాధ్యుడైన ఉపాధ్యాయు డిపై అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీ ఎస్ఎన్ మూర్తి ఆదివారం సాయంత్రం విచారణ చేపట్టారు. టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, నందిగాం ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తదితరులతో కలిసి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబసభ్యులు గ్రామస్థులు, ఉపాధ్యాయులను విచారించి వివరాలు సేకరించారు.

బంజీర్ గ్రామంలో విషాదఛాయలు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజీర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గూడ మార్కండేయరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం టెక్కలి సమీపంలో ట్రాక్టర్ పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు కొన్నాళ్లుగా బియ్యం గోదాం నుంచి డిపోలకు సరుకులు తరలించే ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంటనే క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా అసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు దిగుతూ గాయపడిన జిల్లా వాసి

చీపురుపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగుతున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ కాలు జారడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి గ్రామానికి చెందిన దూబ అప్పన్న ఆదివారం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి మెయిల్‌లో వస్తూ చీపురుపల్లి స్టేషన్‌లో దిగాడు. ఈ క్రమంలో ఆయన కాలుజారి ప్లాట్‌ఫారం, రైలుకు మధ్య ఇరుక్కుంది. కుడికాలు నుజ్జు య్యింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది జయముని, తవిటి నాయుడు వాహనంలోనే ప్రథమ చికిత్స చేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అ'పూర్వ' కలయిక



హిరమండలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 45 ఏళ్ల తరువాత వారంతా ఒకచోట కలుసుకుని రోజంతా ఆనందం పొందారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుపుకుని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పోలినాయుడు, సత్యనారాయణలను సత్కరించారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పెద్దపద్మాపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గారమండలం ఆరికపేట గ్రామానికి చెందిన వారు పలాస మండలం టెక్కలిపట్నం గ్రామానికి పెళ్లి చూపులకు వెళుతుండగా పెద్ద పద్మాపురం వద్ద మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణారావు, అప్పలనాయుడులకు తీవ్రంగా మరో నలుగురికి స్వల్ప గాయాల య్యాయి. వీరికి టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి



- నిధుల కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్న ఎమ్మెల్యేలు
- నేటి నుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులిచ్చి సహకరించాలని ఎమ్మెల్యేలు కోరనున్నారు. సోమవారం నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వారి నియోజకవర్గాలకు ఏమి అవస రమో వాటిని గుర్తించి సీఎంతో పాటు ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించి నిధులను తీసుకు వచ్చేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చే ఉద్దేశంతో సదరు ప్రతిపాదనలతో శాసనసభ్యులు సిద్ధ మయ్యారు. తామంతా అధికార పక్షమే కావడంతో సమగ్ర ప్రణాళికతో వెళ్లి అంశాల వారీగా కొన్ని అసెంబ్లీ సమావేశాలు, మరికొన్ని జీరో అవర్‌లో ప్రస్తావించి, పట్టుబట్టి ఒక్కో సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని వారు పేర్కొంటున్నారు. వారి మాటల్లోనే..

నాగావళి సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదన..



నాగావళి నదీ తీరం సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదన రూపొందించాం. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపా. ఈ విషయంలో నిధుల మంజూరు కోసం తీసుకున్న చర్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తా. శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు అలానే ఆగి పోయింది. మరలా ఔటర్ రింగ్ రోడ్డు కార్యరూపం దాల్చాలి. నగరంలో ఉన్న పెద్ద మార్కెట్‌లో ఒకటో అంతస్తులో ఉన్న దుకాణాలన్నీ ఏళ్ల తరబడిగా వృథాగా ఉన్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెచ్చేలా కొత్తగా నిర్మాణాలు చేపట్టాలి. వంశధార-37 టీఈ కాలువను ఆధునికీకరించాలి. కొత్తవలస, కళింగపట్నం ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలి. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం, ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధి, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని పునర్నించేందుకు నిధు లు విడుదల చేయాలి. సింగుపురంలో నర్సింగ్ కళాశాలను ప్రారంభించాలి. టిడ్కో ఇళ్లకు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి అప్పగించాలి. ఈ అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

ఐటీడీఏ ప్రతిపాదనలు సిద్ధం చేశా..



జిల్లాల విభజన నేపథ్యంలో ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లి పోయింది. దీంతో మెళియాపుట్టిలో ఐటీడీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపాం. దీనికి సంబంధించిన చర్యలపై గిరిజన శాఖ మంత్రిని ప్రశ్నిస్తా. అత్యధిక గిరిజన జనాభా ఉన్నది మా నియోజకవర్గంలోనే.. మొబైల్ అంబులెన్స్‌లు మంజూరుచేయాలని కోరుతున్నా. ఏపీఐఐసీ ద్వారా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని కోరుతున్నా. పాతపట్నంలో ఉన్న 50 బెడ్స్ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చుచేయాలని కోరుతా. ఎల్ఎన్‌పేటలో పోలీసు స్టేషన్, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువ ఆధునికీకరణపై ప్రశ్నిస్తాను. ఈ అంశాలను ప్రశ్నోత్తరాలకు పంపడం జరిగింది.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

నియోజకవర్గానికి సాగు, తాగునీరు ముఖ్యం..



ఎచ్చెర్ల నియోజకవర్గానికి ప్రధానంగా కావాల్సింది సాగు, తాగు నీరు. నారాయణపురం, తోట పల్లి కాలువల పనులను పూర్తి చేయలేదు. రాజాం, పొందూరు మండలాలను దాటుకుని సాగు నీరు శివారు భూములకు రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారు. కాలువల పనులు పూర్తిచేయాలి. నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు ఇచ్చేలా ప్రాధాన్యం ఇవ్వాలి. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ ప్రారంభం కాలేదు. ఈ విషయమై ప్రశ్నిస్తా. కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని పూర్తిచేసేందుకు కేంద్రప్రభుత్వంతో చర్చించాలని అసెంబ్లీలో కోరుతా.

-ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్యే ఎచ్చెర్ల

వంశధార కాలువ లైనింగ్‌కు నిధులివ్వాల్సిందే..



వంశధార ప్రాజెక్టు సాగునీటి కాలువలు మా నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్నాయి. కాలువలకు లైనింగ్ చేయాల్సిందే. వాటికి నిధులు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరతాను. పెండింగ్‌లో ఉన్న కరకట్టల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, బొంతు ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని కోరుతా. వనితమండలం-గార మండలం మధ్య వంతెన పనులను తక్ష ణమే ప్రారంభించాలని, ఈ అంశాలనే ప్రధానంగా ప్రస్తావిస్తాను.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

జీడి బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతా..



పలాస నియోజకవర్గంలో ఎక్కువ మంది ప్రజలు, కార్మికులు జీడి పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఎన్నికల్లో ఇక్కడ జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని అప్పట్లో హామీ ఇవ్వడం జరిగింది. ఈ విషయం ప్రస్తావిస్తా. జీడి కార్మికుల సమస్యలను వివరిస్తా. తీరప్రాంతం కూడా ఎక్కువగా ఉంది. శివసాగర్ బీచ్ అభివృద్ధికి అప్పట్లో ఐదు ఎకరాలు కేటాయించారు. కానీ రిసార్ట్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా కోరుతాను. ఆఫ్‌షోర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాలని, సాగునీటి సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే పలాస

నియోజకవర్గ సమస్యలు ప్రస్తావిస్తా..



ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రధాన సమస్యలన్నింటినీ ప్రస్తావిస్తా. త్వరలో మా నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న థర్మల్ పవర్ ప్రాజెక్టుపై మాట్లాడతాను. సాగునీటి పరంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తా. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు కొంతమేర పూర్తయ్యాయి. అలానే ప్రధాన ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయి. రూ.150 కోట్ల విలువైన పనులకు అనుమతులొచ్చేశాయి. పనులన్నీ పరుగులెత్తించేలా.. శాఖల వారీగా పురోగతి ఉండే అన్ని అంశాలను ప్రస్తావిస్తాను.

-కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

అసెంబ్లీ దృష్టికి బెంతు ఒరియాల ఇబ్బందులు



సాగునీటి పరంగా నియోజకవర్గంలో తీవ్ర సమస్యలున్నాయి. ఎక్కువగా సాంకేతిక సమస్యలున్నాయి. వాటిని ప్రశ్నిస్తా. బెంతు ఒరియా కులస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకాకపోవడంతో ఏవిధమైన రాయితీలు లభించడం లేదు. తితలీ తుఫాన్ సమయంలో నియోజకవర్గంలో తీరప్రాంత మత్స్యకార గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిల మయ్యాయి. వాటిని మార్చాల్సి ఉంది. చూసేందుకు ఇది చిన్న సమస్యగా ఉన్నా.. దీనికోసం ప్రత్యేక బడ్జెట్ కావాలి. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగాలని కోరుతాను. రోడ్ల విషయంలో అటవీశాఖ కొర్రీలు వేయడం వల్ల తీరప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వీటిని అసెంబ్లీ ద్వారా పంచాయతీరాజ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తాను.

-బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

ప్రత్యామ్నాయం చూపండి

- పలాసలో కేంద్రీయ విద్యాలయం పనులను అడ్డుకున్న స్థానికులు
- న్యాయం చేయాలని డిమాండ్
- ఇళ్ల స్థలాలిస్తామని అధికారుల హామీ

పలాస, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి సూదికొండ కాలనీ వెనుక భాగంలో సర్వే నెంబరు 51లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలం చదును చేసే పనిని ఆదివారం రెవెన్యూ అధికారులు చేపట్టారు. అయితే ఈ స్థలాలను గతంలో తాము రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామని, ఈ స్థలాలు జిరాయితీవో, ప్రభుత్వ స్థలాల్లో తెలియదని, ప్రస్తుత అధికారుల చర్యల వల్ల తాము తీవ్రంగా నష్ట పోతున్నామని పలువురు ఆందోళనకు దిగారు. ప్రత్యామ్నాయం చూపాలని వారు కోరగా ఇళ్లులేని వారికి తప్పని సరిగా ప్రభుత్వ స్థలాలివ్వడం జరుగుతుందని అధికారులు భరోసా ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. వివరాలిలా ఉన్నాయి.. పలాసకు కేంద్రీయ విద్యాలయం మంజూరు కాగా సుమారు 15 ఎక రాల స్థలం అవసరం ఉంది. అయితే ఇంత స్థలం పలాస పరిధిలో లేకపోవడంతో సూదికొండ వెనుక భాగంలో సుమారు 9.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండడంతో అక్కడ భవనాల నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయిం చారు. అయితే అప్పటికే ఈ ప్రాంతం ఆక్రమణలకు గురికాగా వైసీపీ హయాంలో మరికొందరు ఇబ్బడి ముబ్బడిగా స్థలాలు ఆక్రమించి అమ్మకాలు చేపట్టారు. కాలనీ దిగువ ప్రాంతంలోని కొందరు వ్యక్తులు జిరాయితీ స్థలాలుగా చూపించడంతో క్రయవిక్రయాలు జరిగాయి. కేంద్రీయ విద్యాలయానికి స్థలం అవసరం కావడంతో రెండు నెలల కిందట కలెక్టర్ దృష్టికి తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఈ స్థలం విషయమై తీసుకువెళ్లగా వెంటనే ఆమోదించారు.

ముందస్తు నోటీసులు

సదరు స్థలంలో పునాదులు, రాళ్లు పెట్టి ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసులు అందించారు. సదరు స్థలాన్ని చదును చేసేందుకు ఆదివారం తహసీల్దార్ సిబ్బందితో కలిసి అక్కడికి వచ్చి ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు ప్రారంభించారు. అయితే అక్కడున్న వారంతా వచ్చి అధికారులను ప్రశ్నించి పనులను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో వైసీపీ, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు తామంతా నిరుపేదలమని, 1994లోనే పట్టాలిచ్చారని వైసీపీ నాయకులు చెప్పగా ఆక్రమణలను తొలగించి విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని టీడీపీ నేతలు అధికారులతో వాదనలకు దిగారు. వైసీపీ నాయకులు మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేసుకుంటుందని, తమ స్థలాల అంశం కోర్టులో దావా ఉందని, తరువాత ఈ వ్యవహారం చూసుకుందామని, పట్టాలున్న వారికి న్యాయం చేయాలని కోరుతూ వెళ్లిపోయారు. టీడీపీలో కొంతమంది పట్టాలు పొందిన వారు తమ నాయకులు వచ్చే వరకు వేచి ఉండాలని కోరడంతో గంటపాటు పనులు నిలుపుదల చేశారు.



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న సీఐ, తహసీల్దార్

ఈ క్రమంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రభుత్వ బృహత్తర కార్యక్రమానికి అడ్డుపడ వద్దని హితవు పలికారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం తప్పని తెలియదా అని ప్రశ్నించారు. అర్హత ఉన్న వారు భూములు కోల్పోతే వారికి రెవెన్యూ అధికారులు స్థలాలు కేటాయిస్తారని వారించారు. తహసీల్దార్ కల్యాణ చక్రవర్తిపై ఓ మహిళ అసభ్యకర పదజాలంతో దూషించడంతో ఆ ప్రాంతం ఒక్కసారి వేడెక్కిపోయింది. తాను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థలాలు స్వాధీనం చేసుకుంటున్నామని, ఇందులో ఎవరికీ అన్యాయం జర గదని తహసీల్దార్ స్పష్టం చేశారు. బాధితులు ఎవరైనా ఉంటే వారికి నిబంధనల మేరకు స్థలాలు కేటా యిస్తామని తెలపడంతో వారంతా వెను దిరిగారు. అనంతరం చదును కార్యక్రమం చేపట్టారు. సూదికొండ కాలనీకి చెందిన యువకులు అక్కడికి చేరుకొని కొందరు వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా స్థలాలు అమ్ముకున్నారని, వారి నిర్వాకం వల్లే బాధితులు ఎక్కువయ్యారని ఆవేదన వ్యక్తం చేశా రు. తమ పిల్లల చదువులు బాగుపడాలంటే కేంద్రీయ విద్యాలయం నిర్మాణం జరగాల్సిందేనని స్పష్టం చేశారు.

నిరుపేదలకు భూమి, ఇల్లు ఇస్తాం..

పలాస జిల్లా కేంద్రం కాబోతోందని, ఇందులో భాగంగా కేంద్రం నుంచి ప్రత్యేక అను మతులతో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన పనులు త్వరితగతిన ప్రారంభించే అవకాశం ఉంది. అభివృద్ధికి అడ్డుపడకండి. వారికి అన్ని విధాలా సహాయకారిగా ఉంటాం. భూములు కోల్పోయిన నిరుపేదలుంటే వారికి స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తాం. గతంలో జరిగిన తప్పులు కూటమి ప్రభుత్వంలో జరగనీయం.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే

ఆలాంధ్ర రోడ్డు పనుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి నుంచి పాతపట్నం ఆలాంధ్ర రోడ్డు పనులను ఆదివారం రహదారులు, భవనాల శాఖ ఈఈ కె.జోహన్ సుధాకర్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'వారం రోజులకే పోయింది' శీర్షికతో వచ్చిన కథనానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందిం చారు. అలాగే సీఎం పేషీ అధికారుల ఆదేశాలతో రోడ్డు ఈఈ పనులను పరిశీలించారు. శిరియాఖండి, సుందరాడ, కమ్మ చెట్లు ప్రాంతాల్లో రాళ్లు తేలినట్లు గుర్తించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నీలమణి దుర్గ ఆలయాన్ని పరిరక్షించాలి



మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహ దారి 326ఏ విస్తరణ పనుల్లో ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీనీలమణిదుర్గ ఆలయాన్ని తొలగించకుండా పరిరక్షించాలని టీడీపీ నాయ కులు కోరారు. ఆదివారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావుతో కలిసి టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. పిల్లర్లు వేసి ఆలయాన్ని రక్షించాలని కోరారు. మంత్రులు హెవే అధికారులతో మాట్లాడారు. టీడీపీ నేతలు సైలాడ సతీష్, రఘునాథ్ జన సామంతో, అక్కుంద్ర సన్యాసి, తడక లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఇదే అంశంపై ఎమ్మెల్యేకి నేతలు వినతిపత్రం అందించారు.

వైభవంగా వాసుదేవుని రథోత్సవం

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

హరిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మందస వాసుదేవ ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఆదివారం స్వామి రథోత్సవం, చక్రతీర్థ స్నానం భక్తజనావళి గోవింద నామ స్మరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించారు.

కనుల పండువగా చక్రతీర్థ స్నానం

ఆలయ ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవ స్వామికి చక్రతీర్థం, అవబృధ స్నానం కనుల పండువగా చేపట్టారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ద్వాదశారాధన, పుష్పయాగం విశేష హోమం ప్రధాన అర్చకులు కూర్మాచార్యులు, సత్యానంద పాడి ఆధ్వర్యంలో చేపట్టారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలాస టీడీపీ నాయకులు వెంకన్న చౌదరి, నాయకులు బావన దుర్యోధన, తిరుపతి రావు, రట్టి లింగరాజు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వారం రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



రథయాత్రలో పాల్గొన్న టీడీపీ నాయకులు వెంకన్నచౌదరి తదితరులు

న్యూస్ బాక్స్

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి

నరసన్నపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మె ల్సీగా కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలి పించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఆదివారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సాయంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, అప్సర, ఆప్కా సంఘ నాయకులతో పాటు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

టెక్కలి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి అండర్-15 చదరంగం పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 40మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి బహుమతులు అందించారు. ట్రైనర్ సనపల భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్, ఆర్బిటర్, అభినవ్, చలపతి, లోకేష్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధునాతన దోభీఘాట్లు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు తరహాలో రాష్ట్రంలో అధునాతన దోబీ ఘాట్లను నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, పలాస జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ 12వ వార్డులో దోబీఘాట్లను పరిశీలించారు.

ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అన్నాపురంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ప్రతిష్ఠలో పాల్గొన్న రామ్మోహన్

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వడ్డివాడ ఎండల సదాశివ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కింజరాపు హరివర ప్రసాద్, ప్రభాకర్, సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బి.గోపాలపురంలో..

పాతపట్నం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బి.గోపాలపురం గ్రామంలో శ్రీ అభయాంజనేయ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలు చేపట్టారు.